క్లుప్తంగా

అద్దెకు ఆర్టీసీ బస్సులు


మాట్లాడుతున్న డీఎం రాజ్యలక్ష్మి

కల్లూరు: శుభకార్యాలు, విహారయాత్రలతో పాటు ఏ ఇతర అవసరాలకైనా అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ బస్సులు ఇవ్వనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కల్లూరు బస్టాండ్‌ను సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఖమ్మం మార్గంలో మూడు డీలక్స్ బస్సులు అదనంగా నడుపుతున్నామని, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు గిఫ్ట్ బాక్సులు ఏర్పాటు చేసామన్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి లక్కీ డ్రా తీసి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. డిపో పరిధిలో సత్తుపల్లి, వీఎం బంజర్, అశ్వారావుపేట బస్టాండ్లలో ఖాళీగా ఉన్న షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆగస్టు 7తో టెండర్ల ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని కోరారు. అనంతరం ఆగస్టు 1న కల్లూరు బస్టాండ్‌లో నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే ప్రదేశాన్ని పరిశీలించారు.

'ప్రేరణ'లో అన్నారుగూడెం వాసి


సర్టిఫికెట్ అందుకుంటున్న అజయ్‌కుమార్

తల్లాడ: జాతీయ స్థాయి ప్రేరణ కార్యక్రమంలో మండలంలోని అన్నారుగూడెంకు చెందిన తోట అజయ్‌కుమార్ పాల్గొన్నాడు. ఆయన గత ఏడాది బాలభారతి విద్యాలయంలో ఎస్సెస్సీ చదవగా జాతీయ స్థాయి ప్రేరణ పోటీల్లో పాల్గొన్నాడు. ప్రస్తుతం ఖమ్మంలో ఇంటర్ చదువుతున్న ఆయనను ఈనెల 21నుంచి 27వరకు గుజరాత్‌లో జరిగిన కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేశభక్తి, క్రీడల్లో నైపుణ్యం, యోగా తదితర అంశాల్లో తర్ఫీదు ఇచ్చారని అజయ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లి బీడీఎస్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సిద్ధారం రోడ్డు ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

చోరీకి యత్నం

మధిరరూరల్: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో సోమవారం రాత్రి రోడ్డు పక్కనే ఉన్న ఒక బడ్డీ కొట్టులో చోరీయత్నం జరిగింది. కంటపూడి శేషయ్యకు చెందిన బడ్డీ కొట్టు తాళాన్ని పగలగొట్టేందుకు గుర్తుతెలియని దుండగులు ప్రయత్నించారు. కానీ గడియ పగలగొట్టడం సాధ్యం కాకపోవడంతో వదిలేసి వెళ్లిపోయారు. గతంలో పలు బడ్డీ కొట్లలో, స్థానిక శివాలయంలో చోరీలు జరిగాయి. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కల్లూరు: కల్లూరులోని బాలికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ జి.రామారావు మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ముఖ్యంగా తినే ఆహారం, తాగే నీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. హెచ్ఎంలు పద్మ, నాగపద్మ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది వసంత, మణెమ్మ, రజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

పెనుబల్లి: మండలంలోని పెనుబల్లి గ్రామంలో పంచాయతీ పరిధిలో ఎంపీడీఓ అన్నపూర్ణ, వైద్యాధికారి కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం బీసీ కాలనీలో వైద్యశిబిరం నిర్వహించి చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పొట్టమ్మ, నిర్మలకుమారి, అలేఖ్య, కరీముల్ల, కృష్ణకుమారి, రాణి సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లను నియమించాలి

తల్లాడ: ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయుల స్థానంలో విద్యావలంటీర్లను నియమించాలని యూటీఎఫ్ తల్లాడ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ క్యాంపెయిన్‌లో భాగంగా మండల కమిటీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు లాల్‌సయ్యద్, ఉపాధ్యక్షుడు ప్రగతికుమారి, వెంకటేశ్వర్లు, శ్రీనువాసరావు పాల్గొన్నారు.

సహకారం అందేలా లేదు..

కొత్త రుణాలపై డీసీసీబీ కొర్రీలు..

- 15 ఏళ్ల నుంచి ఈసీ సర్టిఫికెట్ ఉండాలని నిబంధన
- అయోమయంలో రైతులు



ముష్టికుంట్ల సహకార సంఘం కార్యాలయం

బోనకల్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సహకార సంఘాల ద్వారా మాఫీ అయిన రుణాల స్థానంలో కొత్త రుణాలు ఇచ్చేందుకు కొర్రీలు పెడుతోంది. కమర్షియల్ బ్యాంక్‌ల మాదిరిగా కాకుండా కొత్త, కొత్త కొర్రీలు పెట్టి రైతులకు రుణాలు ఎగ్గొటేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేసింది. రుణమాఫీ జరిగిన రైతులకు వెంటనే సహకార సంఘాలతో అర్హతను బట్టి రుణాలు అందించాల్సి ఉంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఈ నెల 23న కొన్ని షరతులు విధిస్తూ సహకార సంఘాలకు జీఓను విడుదల చేసింది. ఈ జీఓలో మొత్తం 9 షరతులు విధించింది. ఇందులో ఆరో షరతు రైతులకు రుణాలు ఆపేలా ఉండేలా ఉంది.

ఈసీ సర్టిఫికెట్ తప్పనిసరి..

గతంలో రుణాలు ఇచ్చే సమయంలో రైతులకు సంబంధించి పాస్ ఫొటోలు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, 1బీ తీసుకుని రైతులకు ఉన్న పొలం ఆధారంగా సహకార సంఘాలు, కమర్షియల్ బ్యాంక్‌లు రుణాలు ఇచ్చేవి. ప్రస్తుతం కమర్షియల్ బ్యాంక్‌లు గత నిబంధనల ప్రకారం రుణాలు ఇస్తున్నా సహకార సంఘాలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నుంచి విడుదలైన జీఓ ప్రకారం రైతులు తిరిగి రుణాలు పొందాలంటే 15 ఏళ్ల నుంచి ఈసీ సర్టిఫికెట్ తీసుకురావాలని నిబంధన విధించింది. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఒక్కో రైతు మీ సేవా కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అయోమయంలో కొత్తగా పొలాలు కొన్నవారు..

ఇదిలా ఉండగా కొంతమంది రైతులు ఇటీవలే పొలాలు కొనుగోలు చేసిన రైతులు పాత పద్ధతిలో రుణాలు తీసుకొని రుణమాఫీ జాబితాలోకి వచ్చారు. వారికి 15 సంవత్సరాల నుంచి ఈసీ ఎలా వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి నిబంధనలు లేకుండా గతంలో మాదిరిగానే రుణాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

నిబంధన తొలగించాలి



15 ఏళ్ల నుంచి ఈసీ సర్టిఫికెట్ అనే నిబంధన సరైంది కాదు. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. పాస్‌పుస్తకం ఉన్న రైతుకు పాత నిబంధన ప్రకారం రుణాలు ఇవ్వాలి. కొత్త రుణాలు ఇచ్చేందుకు నిబంధనలు పెట్టడం సరైంది కాదు.
– బందం హుస్సేన్, సహకార సంఘం డైరెక్టర్, ముష్టికుంట్ల

కొత్త రుణాలు ఇవ్వాలి..



ఈ ఏడాది ఖరీఫ్ పంట కాలంలో కొత్త రుణాలు అందించాలి. నిబంధనలు పక్కన పెట్టి రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వాలి. లేనిపక్షంలో ప్రైవేటు వ్యాపారస్తుల వద్ద ఎక్కువ వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తుంది.
– పర్సగాని గోవర్ధన్, రైతు, ముష్టికుంట్ల

వినతుల వెల్లువ

వైరా రిజర్వాయర్ భూములకు సాగునీరు విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు భూములకు అధికారులు తక్షణమే సాగు నీరు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం సానుకూలంగా వర్షాలు పడుతున్నందున రిజర్వాయర్‌లోకి నీరు ఆశాజనకంగా ఉందని, నీరు విడుదల చేస్తే రైతులు వరి సాగు చేసుకోవడానికి నార్లు పోసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతిరావు, సత్యనారాయణ, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, వీరభద్రం, శ్రీనివాసరావు, కృష్ణ, కృష్ణారావు, వెంకట్, ప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొణిజర్ల: బంజారాల పెద్ద పండుగ తీజ్, ఆగస్టు 9న నిర్వహించే అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం నాయకులు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు , గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు బన్సీలాల్, గన్యానాయక్, చందర్‌నాయక్, బాణోత్ కిషన్ నాయక్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ముదిగొండ: పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్దమండవకు చెందిన వితంతువులు, దివ్యాంగులు ఎంపీడీఓ శ్రీధర్‌స్వామికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా పింఛన్లకు దరఖాస్తులు చేస్తున్న తమకు మంజూరు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుప ఉపేందర్, మండలాధ్యక్షుడు గుంజలూరి రాంబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతి అందజేస్తున్న కాలనీవాసులు, నాయకులు

సత్తుపల్లిరూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కాకర్లపల్లి బోడు కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావులకు మంగళవారం వినతిపత్రాలు అందించారు. అంతకు ముందు కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పేదలకు నిర్మించి ఇచ్చిన పక్కా గృహాలు శ్లాబులు పెచ్చులు ఊడిపోయి, కుంగి కూలే దశలో ఉన్నాయని, వెంటనే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కాలనీలో రోడ్లు బురదమయం కావటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాలన్నారు. నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, చంద్రశేఖర్, కుమారస్వామి, లక్ష్మీనారాయణ, ఆంగోతు చిట్టెమ్మ, జాని, ఫరీద, చిక్కమ్మ, నాగేశ్వరరావు, జయలక్ష్మి, మున్నీ, లక్ష్మయ్య ఉన్నారు.

పేదలకు అందని మెరుగైన వైద్యం


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ రఘు

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం లక్ష్యం అంటూ ప్రకటనలు చేయడం తప్పా ఆచరణలో ఎక్కడా కనపడడం లేదని, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదని ఎంపీపీ బీరవల్లి రఘు అన్నారు. ఈ మేరకు కల్లూరు ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణను, పరిసరాలను పరిశీలించారు. జ్వర పీడితులు అధికంగా ఉన్నారని, ప్రస్తుతం ఆసుపత్రిలో కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, మరో వైద్యుడు మాత్రమే పని చేస్తుంటే వైద్యం ఎలా అందుతుందన్నారు. డాక్టర్ల కొరత, మందుల కొరత ఉందని రోగులు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై డాక్టర్ నవ్యకాంత్‌ను ప్రశ్నించగా ఇన్‌చార్జ్‌గా ఉన్న పెనుబల్లి ఆసుపత్రి వైద్యులు రమేష్ మూడు రోజుల నుంచి రావడం లేదన్నారురు. మందుల కొరత ఉందన్నారు. సీజనల్ వ్యాధులు అధికం కాకముందే సరైన వైద్యం అందించాలని సూచించారు.

గుంతలు పూడ్చిన ఎంపీటీసీ


గుంతలను పూడ్చుతున్న లచ్చిరాం నాయక్

ఏన్కూరు: మండల పరిధిలోని తిమ్మారావుపేటలో ఇటీవలే కురిసిన రోడ్లన్నీ గుంతలమయం కావడంతో స్పందించిన ఎంపీటీసీ గుగులోతు లచ్చిరాం నాయక్ గ్రావెల్ తెప్పించి స్వయంగా గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు లచ్చిరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీఓగా ఉపేంద్రయ్య



పెనుబల్లి: పెనుబల్లి మండలం పంచాయతీ అధికారిగా శ్రీరామిరెడ్డి ఉపేంద్రయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జయశంకర్ భూపాలపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చారు.

పెండింగ్ డీఏలను ప్రకటించాలి

ఏన్కూరు: పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు డిమాండ్ చేశారు. మండలంలోని ఉన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీ అయిన ఎస్జీటీ టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ త్వరలోనే సాధిస్తామన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సైదయ్య, మండల కార్యదర్శులు చింతారాజు, వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి మజీదు, రమేష్, సురేష్, నర్సింహరావు ఉన్నారు.

'ఆశా'ల ముందస్తు అరెస్టు

వైరా: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు వైరాలో ముందస్తుగానే అరెస్టు చేశారు. ఆశా కార్యకర్తలు శైలజ, రేణుక, మల్లేశ్వరి, ఆదికుమారిలను పోలీస్ స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

చింతకాని: మండలంలోని పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో కార్మికులు పొనుగోటి రామారావు, రాజేష్, గొట్టం వీరభద్రం, ఆశలు పెరుమాళ్లపల్లి జయమ్మ, జలకం రాజేశ్వరీ ఉన్నారు.

కారేపల్లి: మండలంలో పంచాయతీ కార్మికులు, ఆశావర్కర్లను పోలీసులు అరెస్టు చేసి కారేపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో యూనియన్ నాయకులు ఎల్లబోయిన రాధా, జంగా కళ్యాణి, వాంకుడోతు కమల, సుజాత, మేదరి కుమారి, బుచ్చమ్మ, జీపీ వర్కర్లు కొమరయ్య, షేక్ హుస్సేన్, నాగేశ్వరరావు, గౌతమ్, బాల, వెంకన్న, శ్రీను, ఉమా, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎస్సైకు సన్మానం

బోనకల్: బోనకల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన బాలస్వామికి పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పలువురు నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుబాబు మాట్లాడుతూ... విధి నిర్వహణలో ఆయన అంకితభావంతో పనిచేశారన్నారు.

ఏకాగ్రతతో జ్ఞాపకశక్తి మెరుగు


ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

కారేపల్లి: ఏకాగ్రతతో జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకోవాలని, సాధన చేస్తే జ్ఞాపకశక్తి తమ సొత్తు అవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం అన్నారు. ఈమేరకు జ్ఞాపకశక్తి మెళకులపై శిక్షణ కార్యక్రమాన్ని కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను అధ్యాపక బృందం సన్మానించింది. అధ్యాపకులు దుర్గాప్రసాద్, పార్థసారధి, శ్రీవనిత, పాషా, యాకయ్య పాల్గొన్నారు.

అన్నదానాలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వేంసూరురోడ్ శ్రీ మెట్టాంజనేయస్వామి ఆలయం, అయ్యగారిపేట భక్తాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్టాంజనేయస్వామి ఆలయంలో మలిరెడ్డి సుజాత,రత్నం, భక్తాంజనేయస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కాల్నేని కాంతారావు, మల్లూరు అంకమరాజు, వెంకటేశ్వరరావు, చెన్నయ్య, బొంతు మాధవరావు, నాగళ్ల ప్రసాద్, పురుషోత్తం పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

తల్లాడ: గ్రామ పంచాయతీ కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా మంగళవారం అన్నదానం చేశారు. అదేవిధంగా మండలంలోని మల్లవరం పాఠశాలలో జంగా యతిన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, శ్రీనివాసరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, నరసింహారావు, రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌బీ.ప్రసాద్, మూలగుండ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న యర్రా శ్రీనివాసరావు

వైరా: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల అమలుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎం స్థానిక కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీల రేట్లు పెంపుదల, పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కల్పన, తదితర విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో తాత్సారం చేస్తున్నదన్నారు. మండల కార్యదర్శి తూము సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో నాయకులు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, గుడిమెట్ల రజిత, షేక్ షైనాబీ, రమణ పాల్గొన్నారు.

వితరణలు..

విద్యార్థులకు దుస్తులు..

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం పీవీ ఆర్ కల్యాణ మండపం అధినేత పారుపల్లి వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. జయదాస్, ఎన్ఎస్ఎస్ పీఓ తొరియా, రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, మాధవరపు నాగేశ్వరావు, డీఎల్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.


మధిర: వితరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు


కల్లూరురూరల్: బ్యాగులు అందజేస్తున్న శంకర్‌నాయక్


కల్లూరు: దుస్తులు పంపిణీ చేస్తున్న ఏసీపీ రఘు

జేఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు..

కల్లూరు: జేఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ ఆవరణలో ఏసీపీ రఘు పంచాయితీ కార్మికులు, 200 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏసీపీ రఘు మాట్లాడుతూ 2008 నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు జాస్తి శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. అనంతరం ఏసీపీ రఘును సన్మానించారు. ఎస్సై ఎస్‌కె.షాకీర్, ఈఓ ఎన్.నాగేశ్వరరావు, రిటైర్డ్ ఎంఈఓ కాకర్ల రంగారావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.కమ్లి, మాజీ ఎంపీటీసీ పోట్రు శ్రీనివాసరావు, కట్టా గోపాలరావు, బానోత్ చిట్టిబాబు, గోసు కృష్ణారావు పాల్గొన్నారు.

యూపీఎస్‌కు బీరువాలు, కుర్చీలు..

కల్లూరురూరల్: మండలంలోని మర్లపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఆర్టీఓ శంకర్ నాయక్ బీరువాలు, కుర్చీలు, విద్యార్థులకు బ్యాగ్‌లు, టైలు, పెన్నులు, పెన్సిళ్లు వితరణ చేశారు. హెచ్ఎం సోమ్లనాయక్, ఉపాధ్యాయులు సీతారత్నం, పుల్లయ్య, రోజా, అనూష పాల్గొన్నారు.

పెనుబల్లి: మిట్టపల్లి వెంకటరామారావు జ్ఞాపకార్థం కుమారులు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.10 వేల విలువగల నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి నరేంద్ర కుమార్, వేముల సురేష్, అనుమోల సాంబశివరావు, కాటేపల్లి నాగ ప్రసాద్, వందనపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సంబురాలు

రాష్ట్ర ప్రభుత్వం రెండోవిడత రూ.లక్షన్నర లోపు రుణమాఫీ చేసినందుకు గాను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రైతులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని నాయకులు అన్నారు. – సాక్షి నెట్‌వర్క్


చింతకాని: మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు


మధిరరూరల్: మల్లారం రైతువేదికలో వీసీ తిలకిస్తున్న రైతులు


తల్లాడలో..


సత్తుపల్లిటౌన్: పట్టణంలోని సిద్దారం రోడ్డులో..


వేంసూరులో..


ముదిగొండ: మాదాపురం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న రైతులు


ఎర్రుపాలెం: మీనవోలులో..


పెనుబల్లిలో..